క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ: మండలంలో రథసప్తమిని పురస్కరించుకొని శనివారం ఇంజేడు, సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె ఆలయాల్లో వెలసిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనరసింహకంబగిరి స్వామి, అభయాంజనేయ స్వాములకు అభిషేకాలు, కుంకుమార్చన, ఆకు పూజ, తదితర పూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు కమలేశ్‌శర్మ, అనంతయ్య, లక్ష్మణస్వామి, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దొర్నిపాడు: మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామంలో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మించి ఏడాది పూర్తయిన సందర్భంగా రథసప్తమిని పురస్కరించుకొని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు చేశారు. ఆకుపూజ, అభిషేకాలు, హోమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: దీర్ఘకాలిక వ్యాధుల పట్ల రోగులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కాంతరావు నాయక్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజలకు సరైన వైద్యసేవలు సకాలంలో అందేలా చూడాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, వ్యాధులతో బాధపడుతున్న రోగులను గుర్తించి వారికి తగిన వైద్య పరీక్షలు చేయాలని చెప్పారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రీ సర్వేలో పొరపాట్లు ఉండరాదు



సర్వే పనులను పరిశీలిస్తున్న జిల్లా సర్వే అధికారి కృష్ణకుమార్

దొర్నిపాడు: భూ రీసర్వేలో పొరపాట్లకు అవకాశం లేకుండా చూడాలని జిల్లా సర్వే అధికారి కృష్ణకుమార్ సూచించారు. జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకంలో భాగంగా శనివారం మండలంలోని గుండుపాపల గ్రామంలో గ్రౌండ్ కంట్రోల్ పాయింట్స్‌ను చెక్ చేశారు. అధునాతన సాంకేతిక పరికరాలతో భూ సర్వే చేస్తున్నట్లు చెప్పారు. హద్దుల విషయంలో ఇబ్బందులు పడుతున్న రైతులకు రీ సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. భూ హక్కు పత్రాలను సర్వే పూర్తయిన వెంటనే ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయప్రసాద్, డీఐఓఎస్ రవీంద్ర, మండల సర్వేయర్ మల్లయ్య, కార్తీక్ కుమార్‌రెడ్డి, ప్రసన్న పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తనీయొద్దు

గోస్పాడు: గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని ఈఓఆర్‌డీ నాగేంద్రుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో సిబ్బంది నీటి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. తాగునీటి పథకాల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని, ప్రజలకు స్వచ్ఛమైన నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యాలయ వద్దకు వచ్చే ప్రజలకు సరైన సమాచారం ఇవ్వాలని, పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు.

వరిపైరుపై గడ్డి మందు పిచికారీ



గడ్డిమందు పిచికారీ చేయడంతో ఎండిపోయిన వరిపైరు

రుద్రవరం: మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన దానమయ్య అనే రైతుకు చెందిన వరి పంటపై కొందరు వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేసినట్లు బాధిత రైతు శనివారం వాపోయాడు. వేలాది రూపాయల పెట్టుబడులతో వరి పంట సాగు చేశానని, ఇంతలో ఎవరో గడ్డి మందు పిచికారీ చేయడంతో పంటంతా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. విచారణ జరిపి తనకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తి అరెస్టు

ఆళ్లగడ్డ: అడవి పంది మృతికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేశామని అటవీ శాఖ అధికారి కిశోర్‌కుమార్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామ రిజర్వ్ ఫారెస్టు సమీపంలో పెద్దరాముడు అనే వ్యక్తి తన పొలానికి విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడంతో అడవి పంది మృతి చెందిందన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దరాముడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఎఫ్‌బీవోలు మదన్‌గోపాల్, సుభాష్ పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

బొమ్మలసత్రం: మద్యం తరలిస్తూ పట్టుబడిన ఏడు వాహనాలను ఈనెల 30వ తేదీన వేలం వేస్తామని సెబ్ సీఐ నాగమణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తరలిస్తూ పట్టుబడిన ఏడు బైకులను వేలం వేస్తామని, పాల్గొనే వారు రూ.3 వేలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. వేలంలో వాహనం దక్కించుకున్న తర్వాత అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



అరుణ హోమానికి పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు



దేవేరులతో కలిసి రథంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

వైభవంగా రథసప్తమి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో రథసప్తమి వేడుకలను శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణం కోసం సూర్యారాధన, సూర్య నమస్కారాలు, లక్ష్మీగణపతి, ధన్వంతరి హోమాలు జరిపించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాల అనంరం విశేషంగా అలంకరించి నవగ్రహ, సుదర్శన, అరుణ మహోమం చేపట్టి పూర్ణాహుతి గావించారు. అనంతరం స్వామి వారికి దివ్య మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సమాజ్ సభ్యులు సముద్రాల సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రమణీయం..రథోత్సవం

రుద్రవరం: రుద్రవరం–అప్పనపల్లె రహదారిలో వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ నిర్వాహకులు స్వామి వారికి రథోత్సవాన్ని రమణీయంగా నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా అర్చకులు గోపీశర్మ స్వామి అమ్మవార్లకు నిత్య పూజల అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి.. పూలతో ముస్తాబు చేసిన రథంపై ఆశీనులు గావించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు జయజయ ధ్వానాలు, గోవింద నామస్మరణ మధ్య రథాన్ని లాగారు. చివరగా ఆలయంలో స్వామి వారికి కుంకుమార్చన తదితర పూజలు చేపట్టి భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

పనులు త్వరగా పూర్తి చేయాలి

నంద్యాల(సిటీ): సమ్మర్ వాటర్ స్టోరేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. పట్టణంలోని మహానంది రోడ్డులో ఉన్న వాటర్ స్టోరేజ్ సెంటర్‌ను శనివారం పరిశీలించారు. హెడ్ వర్క్స్ పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో పట్టణంలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని, త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తయితే పట్టణంలోని సాయిబాబా నగర్, దేవనగర్, వీసీ కాలనీ, సాదిక్ నగర్, విద్యానగర్, నూనెపల్లె, బొమ్మల సత్రంలోని పలు ప్రాంతాలకు నీరు అందించవచ్చని చెప్పారు. మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, ఏఈ ప్రకాష్ పాల్గొన్నారు.

వలంటీర్ నియామకానికి ఇంటర్వ్యూలు

రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామంలో ఖాళీగా ఉన్న ఒక వలంటీర్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పలువురు అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. అనంతరం ఆయన మండలంలోని పెద్ద కరంబలూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

కనుల పండువగా కల్యాణోత్సవం



వేడుకను తిలకిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని భద్రావతి భావనారాయణస్వామి కల్యాణ మండపంలో శనివారం రథసప్తమిని పురస్కరించుకొని పట్టణ పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి సమేత భావనారాయణస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణాల నడుమ అమ్మవారు స్వామి వారికి కంకణ ధారణతో ప్రారంభమై కల్యాణం, తలంబ్రాలు, తదితర కల్యాణ ఘట్టాలను పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. పెళ్లి పెద్దలుగా గాజుల వేణుగోపాల్, పద్మావతి దంపతులు, వైఎస్సార్‌సీపీ మాజీ కౌన్సిలర్ పున్నాశేషయ్య, కౌన్సిలర్ పున్నా రాజేశ్వరి దంపతులు వ్యవహరించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేపట్టారు. ఇందులో మహిళల కోలాటం ఆకట్టుకుంది. సంఘం అధ్యక్షుడు గాజుల వేణుగోపాల్, ఎర్రయ్య, వెంకటరామయ్య మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9గంటలకు వసంతోత్సవం నిర్వహించి సాయంత్రం ఊంజల సేవ ఉంటుందని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

దొర్నిపాడు: జగనన్న లేవుట్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. శనివారం గుండుపాపల గ్రామంలోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుడా కింద గ్రామానికి 168 గృహాలు మంజూరయ్యాయని వాటిలో 48 మంది నిర్మాణాలు పూర్తయినట్లు చెప్పారు. ఫిబ్రవరి నెలాఖరులోగా ప్రతి లబ్ధిదారుడు నిర్మాణాలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ జయప్రసాద్ మాట్లాడుతూ సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాలనుకుంటే పట్టా రద్దు చేస్తామని పేర్కొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు..

మండలంలోని ఉమాపతినగరంలో సీఎండీఎఫ్ (చీఫ్ మినిస్టర్ డెవెలప్‌మెంట్ ఫండ్స్) రూ.5లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపీపీ శనివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగఅనసూయ, సొసైటీ చైర్మన్ బాలవెంకటరెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ, హౌసింగ్ వర్కఇన్‌స్పెక్టర్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన బాలిరెడ్డి

ఆళ్లగడ్డ: విద్యుత్ లైన్ మేన్ నిర్లక్ష్యం కారణంగా ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన శనివారం ఎస్.లింగందిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాలిరెడ్డి ప్రైవేటుగా విద్యుత్ పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ రైతుకు సంబధించిన విద్యుత్ లైన్‌లో సమస్య తలెత్తడంతో పునరుద్ధరించేందుకు లైన్‌మేన్ మద్దిలేటిరెడ్డి బాలిరెడ్డిని పిలిచి సమస్యను పరిష్కరించాలని సూచించడంతో స్తంభంపైకి ఎక్కాడు. అతను స్తంభం ఎక్కిన విషయం మరచిపోయిన మద్దిలేటిరెడ్డి నిర్లక్ష్యంతో విద్యుత్ సరఫరా చేశాడు. దీంతో విద్యుత్ షాక్‌తో బాలిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృత దేహన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టు మార్టం నిర్వహించారు. కాగా మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఐ.బాషా



సర్దార్‌బాషా

నంద్యాల(సిటీ): జాతీయ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు నంద్యాల జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ప్రతినిధులు మహబూబ్‌బాషా, రామేశ్వర్‌రెడ్డి, రాజకుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ చాగలమర్రికి చెందిన ఐ.బాషా, సర్దార్‌బాషా ఈనెల 13,14 తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపడంతో జాతీయ జట్టుకు ఎంపిక చేశారని చెప్పారు. తమిళనాడులోని కొచ్చిలో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

శిరివెళ్ల: మండలంలోని కోటపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన చెన్నకేశవ, వీరభద్ర, శ్రీ కోదండరామలయంతో పాటు ఆయా ఆలయాల్లో దేవతా మూర్తుల విగ్రహాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం ముగిశాయి. వేకువ జామున నుంచే వేదపండితుల ఆధ్వర్యంలో నవగ్రహాలను ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం నూతన సీతారాములు, చెన్నకేశవస్వామి విగ్రహాలను ప్రతిష్ఠ గావించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామివార్ల దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, ఎంపీపీ మహమ్మద్ వసీం, వైస్ ఎంపీపీ అనూష, సర్పంచ్‌లు హుసేన్‌బీ, నరసింహరెడ్డి, శివారెడ్డి, పెద్దిరమణయ్య, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నరహరి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకదార సుబ్బనారాయణ, ఈశ్వరయ్య, వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు సలాం, ఈఓ వేణునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



చెన్నకేశవస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు



నూతనంగా ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

అంధత్వం అడ్డుకాదు

నంద్యాల(వ్యవసాయం): అంధులకు అంధత్వం అడ్డుకాదని, మేముసైతం విద్య, ఉద్యోగాలు, క్రీడల్లోనూ రాణించగలమని నిరూపించాలని నేషనల్ కళాశాల అధినేత డాక్టర్ ఇంతియాజ్ అహమ్మద్ పేర్కొన్నారు. శనివారం ఎస్పీజీ మైదానంలో అంధుల క్రీడలను ఎంప్లాయీస్ యూనియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు అంధులు సత్తా చాటాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు ఓబులేసు, అంధ క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఇంతియాజ్ అహమ్మద్

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం పెద్దబోధనం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ సాంబశివరావు శనివారం పరిశీలించారు. కూలీలకు సంబంధించిన మస్టర్ పరిశీలించి, కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ పనులు కల్పించాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. వలసలు వెళ్లకుండా పనులు కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నిర్మల ఉన్నారు.



మస్టర్ పరిశీలిస్తున్న ఏపీడీ సాంబశివరావు



ఉద్యోగులతో మాట్లాడుతున్న చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వేణుగోపాల్

వార్డు సచివాలయం తనిఖీ

ఆళ్లగడ్డ: పట్టణంలోని 9వ వార్డు సచివాలయాన్ని చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వేణుగోపాల్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ప్రజల సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు కోరారు. కార్మికుల తొలగింపును అడ్డుకోలేని లేబర్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 20ఏళ్లుగా డెయిరీలో కార్మికులుగా పని చేసిన వారిని అకారణంగా తొలగించడం దారుణమన్నారు. తొలగింపును నిలిపివేయాలని లేబర్ అధికారులు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చినా చర్యలు లేకపోవడం ఆందోళనకరమన్నారు. నాయకులు వెంకటలింగం, ప్రసాద్, సుబ్బయ్య, నాగరాజు, గోపాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): విద్యార్థులకు సరైన భోజనాలు, మౌలిక వసతులు కల్పించని బొమ్మలసత్రం ఎస్సీ పోస్టు మెట్రిక్ నంబరు–1 హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు రాంబాబు కోరారు. ఈ మేరకు శనివారం డీడీ కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విధులకు సక్రమంగా హాజరు కాకుండా, మెనూ పాటించడం లేదన్నారు. శివశంకర్, హుసేన్, సతీష్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ కోరారు. కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్న జగనన్న కాలనీల ఇళ్ల స్థలాలకు క్లియరెన్స్ తెచ్చి పేదలకు అందజేయాలని శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో కోర్టు కేసుల వల్ల పేదలకు పట్టాలు అందలేదని, ప్రభుత్వ భూములను గుర్తించి మరింత మంది పేదలకు పట్టాలు ఇవ్వాలన్నారు. నాయకులు బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, సోమన్న, శ్రీనివాసులు, బాషా, లక్ష్మీదేవి, హరినాథ్, నారాయణమ్మ పాల్గొన్నారు.

హైందవ చైతన్యమే జగతికి శ్రీరామ రక్ష

- ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనంలో వక్తల పిలుపు

కర్నూలు కల్చరల్: హైందవ చైతన్యమే జగతికి శ్రీరామ రక్ష అని బళ్లారి ఉమామహేశ్వర పీఠం పీఠాధిపతి శ్రీ నిత్యానంద భారతి స్వామి అన్నారు. ఓల్డ్ సిటీలోని లలితా పీఠంలో శనివారం జరిగిన ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనంలో పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు, వక్తలు పాల్గొని ప్రసంగించారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఎనిదోతరం వారసులు వీరంభట్లయ్య, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, నాగలింగేశ్వర జీవైక్య మఠం మఠాధిపతి ఎల్లప్ప స్వామి, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి మాట్లాడారు. ఉగాది పర్వదినాన్ని శోభాయమానంగా జరుపుకోవడం, హిందూ కాలమానిని అనుసరించాలన్నారు. పాశ్చాత్య పోకడలు వీడి సంప్రదాయ బద్ధంగా పర్వదినాలను జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు హిందూ ధర్మం పట్ల ఆసక్తిని ఆపేక్షను మాత్రమే కాక అవగాహనను కలిగి ఉండాలన్నారు. ప్రతి మాతృమూర్తి సనాతన ధర్మాన్ని నేర్పాలన్నారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక దాస్, ఆవోపా జిల్లా అధ్యక్షులు యుగంధర్ శెట్టి, హనుమాన్ దీక్ష గురువు రామాంజనేయులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు నీలిమ, నాగరాజశర్మ, రామచంద్రారెడ్డి, టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో ధార్మిక సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న మఠాధిపతులు

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

బనగానపల్లెరూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. పీడీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు పూర్తయ్యాయని, కూలీలు వలస వెళ్లకుండా సొంత గ్రామాల్లోనే పనులు కల్పించాలన్నారు. ఉపాధి పనికి వచ్చే ప్రతి కూలీకి కనీస వేతనం రూ.257 తగ్గకుండా చూడలన్నారు. అలాగే కూలీల జాబ్ కార్డుతో ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ వారికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. ప్రజలకు అవసరమైన పనులనే చేపట్టాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ భాస్కర్‌నాయుడు, ఈసీ హరికిశోర్, టీఏలు షబ్బీర్‌నాయక్, హుస్సేన్ బాషా, చాంద్‌బాషా, శ్వేత, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

శ్రీ మద్దిలేటయ్య ఆదాయం రూ.6,82,409

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ.6,82,409లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. అలాగే అనంతపురం జిల్లా, గుంతకల్ చెందిన రాముడు 400 గ్రాముల వెండి గొడుగును స్వామివారికి బహూకరించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

కోవెలకుంట్ల: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్ సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, నరసింహులు, ఎస్ఐలు వెంకటరెడ్డి, మౌలానీ, తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి న్యాయమూర్తి మాట్లాడారు. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. పేద వారికి ఉచితంగా న్యాయమందించేందుకు కోర్టుల్లో ప్రత్యేక న్యాయవాదులు ఉన్నారన్నారు. కేసులు సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగేషుడు, కాశీంసాహెబ్, ఇంద్రకుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్

అడవులను కాపాడుకుంటేనే మనుగడ

బండిఆత్మకూరు: అడవులను కాపాడుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ఎఫ్ఆర్వో నాసిర్‌ఝా తెలిపారు. శనివారం బండిఆత్మకూరులోని అటవీ కార్యాలయంలో అడవుల సంరక్షణపై స్థానిక రాఘవేంద్ర పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవుల శాతం తగ్గితే ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయని తెలిపారు. అతివృష్టి, అనావృష్టితో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ అడవుల శాతం పెంచడానికి తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరు ఎఫ్ఆర్ఓ పట్టాభి, రామకోటి, సుభాష్, పశువైద్యాధికారిణి అనూష, కరస్పాండెంట్ బిజ్జం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.